నీళ్లు పాతాళానికి.. నిధులు ఢిల్లీకి

బ్యాగులు మోసుడే రేవంత్ చరిత్ర.. ఇది కాంగ్రెస్ రాష్ట్ర కొత్త ఇన్‌చార్జికి తెల్వదేమో!.. తన బ్యాగులు మోయొద్దని ఆమె అనడం పెద్దజోక్: కేటీఆర్

- మైక్‌లో చెప్పేందుకు రేవంత్ మంచి పనులే చెయ్యలే
- చెడు చెప్పడం మొదలుపెడితే చెవుల నుంచి రక్తమే
- కేసీఆర్ పాలన స్వర్ణయుగం.. రేవంత్‌ది చీకటియుగం
- క్రైమ్‌రేట్, అప్పులు, ఆత్మహత్యల్లో రాష్ట్రం రైజింగ్
- తెలంగాణకు ఎన్నటికీ బీఆర్ఎస్సే శ్రీరామరక్ష
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరికల సందర్భంగా మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి, మహమూద్ అలీ, సబిత, మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో రాష్ట్రానికి కేసీఆర్ సంపూర్ణం న్యాయం చేస్తే ఇవాళ రేవంత్‌రెడ్డి పాలనలో నీళ్లు పాతాళానికి పోయాయని, నిధులేమో ఢిల్లీకి పోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవాచేశారు. మంచిని మైక్‌లో చెప్పాలి.. చెడును చెవిలో చెప్పాలని సెలవిచ్చిన రేవంత్‌రెడ్డి ఒక్క మంచి పని కూడా చేయలేదు కాబట్టే ఎవరూ మైక్‌లో చెప్పడం లేదని దెప్పిపొడిచారు. రేవంత్ పాలనలో చేసిన చెడుమాత్రం చాలా ఉన్నదని మండిపడ్డారు. హైడ్రాతో పేదల ఇండ్ల విధ్వంసం, ఆర్ ఆర్ టాక్స్, భూకబ్జాలు, అంతులేని అవినీతితో కుప్పకూలిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్, కొట్టుకుపోయిన పెద్దవాగు, మునిగిన వట్టెం పంప్‌హౌస్ ఇలా చెప్పడం మొదలుపెడితే రేవంత్ చెవుల నుంచి రక్తం కారుతుందని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండల మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డితోపాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలు శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'జనవరి 26న ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు టకీటకీమని పడతాయని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చింద్రు. రూపాయి కూడా పడలేదు. రుణమాఫీ కాలేదు, పెన్షన్లు పెరగలేదు.. రైతు భరోసా లేదు.. ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి కింద తులం బంగారం లేదు.. ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నిలబెట్టు కోకపోడంతో రేవంత్‌రెడ్డిని మహిళలు పొట్టు పొట్టు తిడుతున్నరు. కేసీఆర్ హయాంలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణ, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో విధ్వంసం, అరాచకాలతో కుప్పకూలింది. హైడ్రా, మూసీ కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతీన్నది. మేడ్చల్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరం' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు.

> రాష్ట్రాన్ని అన్నింట్లో ఆగం పట్టించిన రేవంత్‌రెడ్డి.. కొత్తగా తెలంగాణ రైజింగ్ నినాదాన్ని ఎత్తుకున్నడు. ఏడాదిలో రూ.1,50,000 కోట్ల అప్పు తెచ్చి, ఒక్క పథకాన్ని ప్రారంభించలేదు. ఒక్క ప్రాజెక్టుకు ఇటుక పేర్చలేదు. ఎక్కడ రైజింగ్? 450 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నరు. ఆటో డ్రైవర్లు, చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నరు. క్రైమ్‌రేట్, అప్పులు, ఆత్మహత్యల్లోనే తెలంగాణ రైజింగ్ కనిపిస్తున్నది. -కేటీఆర్

> కేసీఆర్ పాలనలో ఎండాకాలంలో నూ చెరువులు అలుగులు దుంకితే రేవంత్‌రెడ్డి పాలనలో కాళేశ్వరం నీళ్లు ఇవ్వక పంటలు ఎండిపోతున్నయి. నీళ్లు పాతాళానికి పోతుంటే.. నిధులు ఢిల్లీకి పోతున్నయి. నియామకాలు గాలికి పోయినయి. -కేటీఆర్

కేసీఆర్‌ను తలుచుకుంటున్నరు

'అధికారం ఎవరికీ శ్వాశతం కాదు. అందర్నీ ఏకం చేసి ఢిల్లీ పెద్దల మీద ఒత్తిడి చేసి చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణను సాధించిండ్రు. సంతోషం వచ్చినా.. దుఃఖం వచ్చినా ఇవాళ కేసీఆర్‌ను ప్రజలు యాది చేసుకుంటున్నరు. కుటుంబానికి బాపు లెక్క.. తెలంగాణ బాపు కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగుండె అని వృద్ధులు, పేదింటి ఆడబిడ్డలు చెప్తున్నరు. ఎక్కడ ముసలవ్వను అడిగినా.. పెద్ద కొడుకు కేసీఆర్ ఇచ్చిన పెన్షనే వస్తున్నదని అంటున్నరు. కేసీఆర్ ఉన్నప్పుడు కల్యాణ లక్ష్మి వచ్చిందని, కేసీఆర్ కిట్ వచ్చిందని చెప్తున్నరు. అప్పుడా పథకాలు లేనేలేవని ఆడబిడ్డలు బాధపడుతున్నరు. రైతు బంధు పడ్డలేదు.. రేవంత్ పచ్చి జూటాగాడని అన్నదాతలు తిడుతున్నరు. కేసీఆర్ ఉన్నప్పుడు నాట్లు వేసే టైంకు రైతుబంధు పడుతుండెనని గుర్తు చేసుకుంటున్నరు. రైతులను, ఉద్యోగులను, నిరుద్యోగులను వృద్ధులను, మహిళలనే కాదు.. రేవంత్‌రెడ్డి అందరి కొంప ముంచిండు' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

కేసీఆర్ నాయకత్వంలో నీళ్లు, నిధులు, నియామకాలు అనే తెలంగాణ ఉద్యమ నినాదం సాకారమైందని కేటీఆర్ గుర్తుచేశారు. 'కేసీఆర్ నాయకత్వంలో ఇంటింటికీ మంచినీళ్లు తెచ్చుకున్నం. సాగునీరివ్వడంతో సాగు పెరిగింది. వరి పంటలో నంబర్ వన్‌గా నిలిచినం. నిధుల విషయంలో తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్ వన్‌గా రాష్ట్రాన్ని నిలిపినం. రైతుబంధు, రుణమాఫీ ద్వారా లక్ష కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినం. సంపద సృష్టించి పేదలకు పంచినం. రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2000కు పెంచినం. ఎన్నో కొత్త ప్రాజెక్టులు కట్టినం. నియామకాల విషయానికొస్తే ప్రభుత్వ రంగంలో 2.32 లక్షల ఉద్యోగాలు, ప్రైవేట్ రంగంలో 24 లక్షల ఉద్యోగాలను కేసీఆర్ సృష్టించింద్రు. ఈ మూడింటిలో కేసీఆర్ సంపూర్ణంగా న్యాయం చేసింద్రు. కానీ, ఇవాళ రేవంత్‌రెడ్డి పాలనలో నీళ్లు పాతాళానికి పోయినయి.. కేసీఆర్ మీద కోపంతో కాళేశ్వరం నీళ్లు ఇవ్వకపోవడడం వల్ల పంటలు ఎండిపోతున్నయి. నీళ్లు పాతాళానికి పోతే.. నిధులేమో ఢిల్లీకి పోతున్నయి. జాబ్ క్యాలెండర్, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలన్నరు.. కానీ పత్తాలేవు. రాహుల్‌గాంధీ అశోక్‌నగర్ వెళ్లి ఏడాదికి 2 లక్షల ఉద్యోలిస్తామని చెప్పిండు. ఆరు వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు' అని కేటీఆర్ దుమ్మెత్తిపోశారు.

పాలమూరు పనులు ఎందుకు చేస్తలేరు?

అధికారం చేపట్టి 15 నెలలవుతున్నా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పదిశాతం పనులను ఎందుకు పూర్తిచేయడం లేదని కేటీఆర్ నిలదీశారు. 'పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా చేవెళ్ల, శంకర్‌పల్లి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు నీళ్లు తెచ్చేందుకు కేసీఆర్ కృషిచేస్తే.. ఇదే కాంగ్రెస్ నేతలు కేసులు వేసి ఆపింద్రు. అయినా 90 శాతం పనులు పూర్తయినయి. కేవలం 10శాతం పనులు చేస్తే చేవెళ్లకు నీళ్లు వస్తయి. కేవలం కాల్వలు తవ్వితే నీళ్లు వస్తయి. కానీ, రేవంత్‌రెడ్డి అలా చేయడం లేదు. కేసీఆర్‌కు పేరు వస్తుందన్న అసూయతో ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నడు. అది చేయకుండా.. మూసీని సుందరీకరణ చేస్తాడంట. వికారాబాద్ అడవుల్లో మొదలయ్యే మూసీని కిందకు తీసుకుపోయి నందనవనం చేస్తా అంటున్నడు. మూసీతో సాగయ్యేది ఎన్ని ఎకరాలు? సృష్టించే సంపద ఎంత ? దాని వల్ల ఈ నగరానికి, రాష్ట్రానికి లాభమెంత అంటే చెప్పడు. పాలమూరు ఎత్తిపోతలను పూర్తిచేస్తే రేవంత్‌కు కమీషన్లు దొరకవు. కాబట్టి మూసీ పేరిట రంగుల కల చూపించి లక్షన్నర కోట్లు ఖర్చు పెడుతా అని చెప్పి 70 వేల కోట్లు దండుకోవాలనేది రేవంత్‌రెడ్డి ప్లాన్. ఆ 70 వేల కోట్లను ఢిల్లీ పెద్దలకు పంపి కుర్చీ కాపాడుకోవాలనే తాపత్రయంతో రేవంత్‌రెడ్డి పని చేస్తున్నరు' అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

> బ్యాగులు మోసి సీఎం అయిన రేవంత్‌ను పక్కన పెట్టుకొని తన బ్యాగులు మోయొద్దని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల కొత్త ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడటం విడ్డూరంగా ఉన్నది.. ఇది పెద్ద జోక్.. అప్పట్లో చంద్రబాబుకు బ్యాగులు మోస్తే, ఇప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానానికి రేవంత్‌రెడ్డి బ్యాగులు మోస్తున్నడు. -కేటీఆర్

కాంగ్రెస్‌ది సుతిలేని సంసారం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరు సుతిలేని సంసారం తరహాలో ఉన్నదని కేటీఆర్ మండిపడ్డారు. మంత్రుల మధ్య కనీసం సమన్వయం లేదని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల ప్రమాదంలో కార్మికులు చనిపోయారని ఓ మంత్రి చెప్తే, మరో మంత్రి చనిపోలేదని అంటున్నారని తెలిపారు. మట్టి దిబ్బల కింద ఎనిమిది మంది చిక్కుకుపోతే, చేపల కూర కావాల్సి వచ్చిందా? అని నిలదీశారు. టన్నెల్ ప్రమాదానికి వాటర్‌లో నీళ్లు కలవడమే కారణమని సోయిలేకుండా మాట్లాడుతున్నరని ఎద్దేవాచేశారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలుండి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి గుండుసున్నా తెచ్చారని మండిపడ్డారు. కనీసం ఒక నవోదయ స్కూల్, కనీసం ఒక కాలేజీ కూడా కేంద్రం నుంచి తేలేకపోయారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఎట్టి పనికైనా మట్టి పనికైనా మనోడు ఉండాలే. తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్సే. తెలంగాణకు శ్రీరామరక్ష కేసీఆరే. పార్లమెంట్ ఎన్నికల్లో అయినా, పంచాయతీ ఎన్నికల్లో అయినా గులాబీ జెండా ఎగరాల్సిందే. రాబోయే పంచాయతీ, ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుంది. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ మళ్లీ అగ్రస్థానంలో నిలుస్తుంది. గులాబీ జెండా ఎగిరితేనే తెలంగాణ గెలుస్తుంది.. నిలుస్తుంది? అని కేటీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి, నాయకులు పట్లోళ్ల కార్తిక్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, ఆంజనేయగౌడ్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులు, ఆత్మహత్యల్లో రైజింగ్

రాష్ట్రాన్ని అన్నింట్లో ఆగం పట్టించిన సీఎం రేవంత్‌రెడ్డి.. కొత్తగా తెలంగాణ రైజింగ్ అనే నినాదాన్ని ఎత్తుకున్నారని కేటీఆర్ విమర్శించారు. ఏడాదిలోనే రూ.1,50,000 కోట్ల అప్పు తెచ్చి, ఒక్క కొత్త పథకాన్ని కూడా ప్రారంభించలేదు. ఒక్క ప్రాజెక్టుకు కూడా ఇటుక పేర్చలేదు. ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టలేదు. ఒక్క కొత్త రేషన్‌కార్డు ఇవ్వలేదు. ఎక్కడ రైజింగ్? 450 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నరు. ఆటో డ్రైవర్లు, చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నరు. క్రైమ్‌రేట్‌ను భారీగా పెంచింద్రు. తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టింద్రు. క్రైమ్‌రేట్, అప్పులు, ఆత్మహత్యల్లోనే తెలంగాణ రైజింగ్ కనిపిస్తున్నది' అని కేటీఆర్ విమర్శించారు.

రేవంత్ కౌంట్‌డౌన్ స్టార్ట్ : మధుసూదనాచారి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పతనానికి కౌంట్‌డౌన్ మొదలైందని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి చెప్పారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మార్పే ఇందుకు నిదర్శమన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలన సబ్బండ వర్ణాలకు స్వర్ణయుగమైతే.. రేవంత్‌రెడ్డి పాలన చీకటి యుగమని అభివర్ణించారు. ఉమ్మడి రాష్ట్రంలో కరువు తాండవించిందని, తెలంగాణలో అనేక జిల్లాలను కేంద్రం కరువు ప్రాంతాలుగా ప్రకటించిందని గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో చెరువులు వేసవిలో కూడా అలుగులు దుంకాయని పేర్కొన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరడం ప్రజల హృదయ స్పందనకు నిదర్శమని చెప్పారు. ఇటీవల శివరాత్రి సందర్భంగా శివాలయాలను సందర్శిస్తే ప్రజలంతా కేసీఆర్ మళ్లీ రావాలని కోరారని తెలిపారు.

ముస్లింల కలలు సాకారం కావాలి

- కేసీఆర్ రంజాన్ మాస ప్రారంభ శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో ఆచరించే కఠోర ఉపవాసం దైవచింతనను, ఆధ్యాత్మికతను, క్రమశిక్షణను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. గంగా జమునా తెహజీబ్ సంస్కృతికి దర్పణంగా ఉన్న తెలంగాణ ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ లౌకికవాదం, మతసామరస్య పరిరక్షణకు ఆదర్శప్రాయంగా నిలిచిందని తెలిపారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి పదేండ్ల బీఆర్ఎస్ పాలన అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తుచేశారు. రంజాన్ మాసంలో ఉపవాసాలు చేసే ముస్లింల కలలు సాకారం కావాలని ఆయన ఆకాంక్షించారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

సర్కారు నిర్లక్ష్యంతోనే కార్మికుల దుర్మరణం

- కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ప్రమాదం
- ఒక్కో బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారమివ్వాలి
- బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతోనే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఘటనలో 8 మంది కార్మికుల ప్రాణాలు గాల్లో కలిశాయని బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ ఘటనకు సీఎం రేవంత్‌రెడ్డే బాధ్యత వహించాలని, బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో కార్మికవర్గాన్ని కడుపులో పెట్టి చూసుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చిన్నచూపు చూస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ నారాయణ మాట్లాడుతూ కార్మికులపై ముఖ్యమంత్రి మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి మారయ్య మాట్లాడుతూ కార్మికుల ప్రాణాలు కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

కళ్యాణమస్తు
..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో
రెడ్డి వధూవరులకు ప్రత్యేకంగా చూడబడును మరియు అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి:
16 Year's Experience
Dr. Smt. Konala Bhagyalakshmi Reddy, Astrologer,
Ex:Telangana Marriage Bureau Association.
H.O: షాప్ నెం.48, HMDA కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్
B.O: Opposite Sai Baba Temple, Dilsukhnagar,
Whatsapp: 9866044439

వధువు కావలెను
★రెడ్డి:30 Yrs, 5'10", B.Tech., MBA, Sr. Software Engg., 40 Lakhs P/A, 30 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9246960888
★రెడ్డి:29 Yrs, 5'9", MBBS, MS, Doctor, 2.5 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన MS వధువు కావలెను. 7207930999
★రెడ్డి:32 Yrs, 5'10", M.Tech (IIT) MS, Software, USA, 180K P/A, I-140, 20 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9701960229
★రెడ్డి:30 Yrs, 5'9" MS, Australia, Network, Technician, 150K P/A గల Well Settled వరుడికి తగిన వధువు కావలెను. 9030315599
★రెడ్డి:30 Yrs, 5'10", B.Tech, MS, Canada, Software, 100K P/A (PR Holder) గల వరుడికి తగిన వధువు కావలెను. 9010051444
★రెడ్డి:32 Yrs, 6 Ft, B.Tech (Bits Pilani) MS, USA, Software Developer, 400K P/A గల Well Settled వరుడికి తగిన వధువు కావలెను. 9248064777
★రెడ్డి: 32 Yrs, 5'10', M.Tech, MS, Own Business, Hyd, 50 Lakhs P/M, 100 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9246960888
★రెడ్డి:32 Yrs, 5'10", M.Tech., (Central Govt. Job) Deputy Manager, Hyderabad, 15 Lakhs P/A గల వరునికి తగిన వధువు కావలెను. 9701960229
★రెడ్డి:31 Yrs, 6 Ft, MBA, Software, 10 Lakhs P/A గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777
★రెడ్డి-2nd Match: B.Tech, (IIT), MBA (USA) Software, 250K P/A, 20 Cr. ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. 9010051444

వరుడు కావలెను
★రెడ్డి:26 Yrs, 5'5", BBA, MBA, Digital Marketing, 25 Lakhs P/A, 100 Cr. ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. 9246960888
★రెడ్డి:27 Yrs, 5'4", MBBS, MS, Doctor, 2 Lakhs P/M, 30 Cr. ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599
★రెడ్డి: 29 Yrs, 5'5", B.Tech, MS, USA, Software, 150K P/A, 10 Cr. ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999
★రెడ్డి:29 Yrs, 5'3", MBBS, PG, (OBGY), Doctor గల వధువుకు తగిన PG Doctor వరుడు కావలెను. 9701960229
★రెడ్డి:28 Yrs, 5'4", CA, Sr. Accounts Manager, Hyd, 10 Lakhs P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777
★రెడ్డి:27 Yrs, 5'5", B.Tech., MBA Product Manager, 15 Lakhs P/A, 10 Cr. ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. 9010051444
★రెడ్డి:30 Yrs, 5'7", B.Tech., MS, USA, Data Engg. 200 K P/A (Green Card Holder), 50 Cr. ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888
★రెడ్డి:27 Yrs, 5'6", MBBS, House Surgeon గల వధువుకు తగిన MS వరుడు కావలెను. 9010051444
★రెడ్డి:28 Yrs, 5'3", B.Tech (NIT) Ph.D., Sr. System Engg. Bangalore, 26 Lakhs P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599
★రెడ్డి: 30 Yrs, M.Tech (IIT), MS, USA, Software, 180K P/A గల వధువుకి వరుడు కావలెను. 7207930999

వధువు కావలెను
★డైరెక్ట్: కుల పట్టింపు లేదు. 48 Yrs, BC 2వ పెళ్ళి 60K P/M, డిగ్రీ ప్రైవేట్ జాబ్, హైదరాబాద్‌లో స్వంత ఇల్లు ప్రాపర్టీ ఉన్న వరునికి తగిన వధువు కావలెను. సంప్ర: 9618346855.
★రెడ్డి: లేట్ మ్యారేజ్, 42 Yrs, 5'6", Hyd, Pvt. Job, వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 9110710354

వధువు కావలెను
★ఆర్య వైశ్య అబ్బాయి 1989, M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, వ్యవసాయం, 14x2=28 వేలు, ఆస్తి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, ముసుగోడు రోడ్డు.

వరుడు కావలెను
★పద్మశాలి: 44 Yrs, 5'3", 1st & 2nd, 33 Yrs, 5'3", డైవర్స్ అందమైన వధువులకు Well Settled India, Abroad గల వరులు కావలెను. విజయవాడ. సెల్: 7673926517

VIP'S MP REDDY MATRIMONY
30 సంవత్సరముల అనుభవం గల సంస్థ

రెడ్డి:డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బిజినెస్, ప్రైవేట్ జాబ్స్ మరియు దేశ, విదేశ వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి. ఫాస్ట్ సెటిల్‌మెంట్.
CONTACT: M.P. REDDY Executive Service
94 93 93 93 93
Head Office: Banjara Hills, Road No.2, Near TV9

4 లైన్ల ప్రకటనకు 500/- (+ GST అదనం) ప్రతి అదనపు లైనుకు 125/-
9848077857

బీఆర్ఎస్‌కు నిర్బంధం.. బీజేపీకి స్వాగతం

- ఎస్ఎల్‌బీసీ సందర్శనలో కాంగ్రెస్ సర్కార్ వివక్ష
- బీజేపీ ప్రతినిధి బృందానికి స్వాగతం
- ఆంక్షలు లేకుండా ఆహ్వానం
- బీఆర్ఎస్ నేతలు వెళ్తే ఉలికిపాటు

టన్నెల్ సందర్శన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ ప్రతినిధుల బృందం

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ)/మహబూబ్‌నగర్, మార్చి 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరికి రెండు రోజుల్లో జరిగిన పైరెండు ఘటనలే నిదర్శనం. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ ఘటనలో ప్రభుత్వం ఒక్కో పార్టీతో ఒక్కో విధంగా వ్యవహరిస్తుండటంపై రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తికర చర్చ జరుగుతున్నది. మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం వస్తే పోలీసులతో ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. కనీసం మంత్రి, అధికారులను కలిసేందుకు కూడా అనుమతి ఇవ్వలేదు. టన్నెల్ లోపలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదు. కాని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో వచ్చిన ఆ పార్టీ బృందానికి రాచమర్యాదలతో ఆహ్వానం పలికారు. ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచి ఏకంగా సొరంగంలోకి అనుమతిచ్చింది. బీజేపీ ప్రతినిధి బృందానికి దగ్గరుండి వివరించారు. బీఆర్ఎస్ ప్రతినిధి బృందాన్ని ఎందుకు అడ్డుకున్నట్టు, బీజేపీ నేతలకు సకల ఏర్పాట్లు ఎందుకు చేసినట్టు? అని చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ చేతులు కలిపాయన్న ప్రచారానికి తాజా ఘటన మరింత ఆజ్యం పోస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.

> ఫిబ్రవరి 27: మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పరిశీలనకు వెళ్తే ప్రభుత్వం అడ్డుకున్నది. నేతలపై పోలీస్ కేసులు నమోదు చేసింది.
>
> మార్చి 1: బీజేపీ నేతలు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు రాగానే ప్రభుత్వం రెడ్‌కార్పెట్ పరిచి ఆహ్వానించింది. ప్రమాదం జరిగిన తీరు, సహాయక చర్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు దగ్గరుండి వివరించారు.

మంత్రుల హడావుడి

బీజేపీ ప్రతినిధి బృందం లోపలికి వస్తున్నదన్న సమాచారం తెలియగానే మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి సమీక్ష సమావేశాన్ని ఆపి మరీ బీజేపీ బృందానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే: బాలరాజు

బీజేపీ బృందం పర్యటనతో కాంగ్రెస్, బీజేపీ ఒప్పందం బయటపడిందని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు విమర్శించారు. బీఆర్ఎస్ ప్రతినిధి బృందాన్ని టన్నెల్‌లోకి వెళ్లనివ్వకుండా, బీజేపీ నేతలనే అనుమతించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ రెండు పార్టీలు ఒక్కటే అనేందుకు ఉదాహరణ ఇదే అన్నారు.

పర్యవేక్షణ నుంచి తప్పుకున్న మంత్రులు?

టన్నెల్‌లో రెస్క్యూ పర్యవేక్షణ అంతా అధికారులదే

మహబూబ్‌నగర్, మార్చి 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరుగుతున్న రెస్క్యూ ఆపరేషన్‌ను అధికారులపై నెట్టేసి, మంత్రులు తప్పుకున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. 8 రోజుల క్రితం దోమలపెంట ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలిన ఘటనలో 8 మంది కార్మికులు గల్లంతయ్యారు. ఘటన జరిగినప్పుడు అంతా తామే అన్నట్టు వ్యవహరించిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు.. చివరి నిమిషంలో అధికారులపై భారం మోపారు. ఆదివారం నుంచి తాము రాబోమని అధికారులకు తేల్చి చెప్పినట్టు ప్రచారం జరుగుతున్నది. రెస్క్యూ ఆపరేషన్ చివరి దశకు చేరుకున్న తరుణంలో మృతుల కుటుంబాలకు ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందోనని వారు తప్పుకున్నట్టు భావిస్తున్నారు. నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ, ఇతరులకు బాధ్యతలు అప్పజెప్పి మంత్రులు తప్పుకోవడం తీవ్ర విమ